క్లుప్తంగా

కోదండ రామాలయం పరస నేడు



పూజలందుకోనున్న సీతారామ లక్ష్మణులు

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్ హౌస్ అండ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామాలయం పరస మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు రాంనగర్ గ్రామ పెద్దల కమిటీ, రామ భజన కమిటీ, యూత్ కమిటీ ప్రతినిధులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బెల్లాలకు హాస్య కళానిధి బిరుదు



బెల్లాల నాగేశ్వరరావును సత్కరిస్తున్న అతిథులు

పెదగంట్యాడ : మాతృశ్రీ కళానికేతన్ ఆధ్వర్యంలో దివంగత నాటకరంగ కళాకారులు వి.సంగమేశ్వరరావు జయంతి వేడుకలను నడుపూరులోని రామాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు సంగమేశ్వరరావు, బీర వరహాలరావు, పాల సత్యనారాయణరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు నాటక రంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిన్ను నువ్వు తెలుసుకో నాటిక ఆలోచింపజేసింది. అనంతరం బెల్లాల నాగేశ్వరరావుకు హాస్య కళానిధి బిరుదు అందజేశారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, మంత్రి రాజశేఖర్, ఎఫ్ఎం బాబాయ్, తాటికొండ కాశీవిశ్వేశ్వరరావు, కులుకూరి మంగరాజు, మంత్రి శంకరనారాయణ, మునగపాక అచ్చింనాయుడు, మంత్రి గోపి, బొడ్డు కృష్ణారావు, జెర్రిపోతుల ముత్యాలు, నక్క లక్ష్మణరావు పాల్గొన్నారు.

కార్మికుల జీతాల కోసం వినతి

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల పెండింగ్ జీతాల చెల్లింపు కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని స్టీల్ బీఎంఎస్ నాయకులు కేంద్ర ఉక్కు సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మను కోరారు. ఈ మేరకు వారు గురువారం కేంద్ర మంత్రితో ఫోన్‌లో మాట్లాడి లేఖ పంపారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు గత నాలుగు నెలలుగా సక్రమంగా జీతాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఉక్కు యాజమాన్యంతో చర్చించి జీతాల చెల్లింపు కోసం చర్యలు తీసుకోవాలని యూనియన్ అధ్యక్షుడు ఎం.రామస్వామి, ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల రమణ కోరారు.


సిరులతల్లికి పంచామృతాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్‌కు నో

● స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వర్తించదన్న ఆర్‌పీఎఫ్ కమిషనర్లు ● నివ్వెరపోయిన కర్మాగారం పెన్షనర్లు



స్టీల్‌ప్లాంట్ ముఖచిత్రం

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న హయ్యర్ పెన్షన్‌కు ఈపీఎఫ్ అధికారులు నో చెప్పేశారు. డిమాండ్ నోటీసుల మేరకు సొమ్ము చెల్లించి గత 16 నెలలుగా పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న పెన్షనర్లు ఈ వార్త విని నివ్వెరపోయారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ అంశాన్ని సత్వరమే తేల్చాలని ఇటీవల విశాఖ రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ల (ఈపీఎఫ్)ను కలిశారు. ఈ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు చెందిన పీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్టు నిబంధనల ప్రకారం ఆ ఉద్యోగులు, పెన్షనర్లు హయ్యర్ పెన్షన్‌కు అర్హులు కారని వారు తెలిపారు. త్వరలో వారు కట్టిన సొమ్మును చెల్లిస్తామని తెలిపారు.

కేంద్ర కార్మిక శాఖ మంత్రి దృష్టికి...

స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు హయ్యర్ పెన్షన్‌పై విశాఖ ఆర్‌పీఎఫ్‌సీ అధికారుల వైఖరిని కేంద్ర కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ నెలాఖరున ఢిల్లీ వెళ్లి తేల్చుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. అవసరమైతే న్యాయపరంగా తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నారు.

2,948 మందికి డిమాండ్ నోటీసులు

దేశంలోని ఈపీఎఫ్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ వర్తింప చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు విశాఖపట్టణం రీజినల్ పీఎఫ్ కార్యాలయం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు 2,948 మందికి డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అందులో 400 మంది రిటైర్డ్ ఉద్యోగులతోసహా 1400 మంది ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ కోసం సుమారు రూ.400 కోట్లు చెల్లించారు. హయ్యర్ పెన్షన్ వస్తుందని కొంత మంది తమ డిపాజిట్లు తీసేసి డబ్బులు కట్టగా మరికొంత మంది తమ పిల్లల వద్ద తీసుకుని, మరికొంత మంది అప్పులు చేసి ఆ సొమ్ము చెల్లించారు. అప్పటి నుంచి వారు హయ్యర్ పెన్షన్ కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. గత 16 నెలలుగా వారు పీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ సిబ్బంది అడిగిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఈ అంశంపై ఇటీవల జరిగిన పీఎఫ్ సెంట్రల్ బోర్డు ట్రస్టీల సమావేశంలో సభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. డిసెంబర్‌లో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు, సెంట్రల్ పీఎఫ్ బోర్డు ట్రస్టీలు కేంద్ర కార్మిక శాఖ మంత్రి దృష్టికి తేగా ఆయన జనవరిలోగా సమస్య పరిష్కరించాలని ఈపీఎఫ్‌ఓను ఆదేశించారు. కేంద్ర ఈపీఎఫ్‌ఓ అదనపు కమిషనర్ జనవరి 18న హయ్యర్ పెన్షన్ చెల్లింపులోని సందేహాలకు వివరణ ఇచ్చి వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలని దేశంలోని అన్ని రీజినల్ ప్రావిడెంట్ కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో హయ్యర్ పెన్షన్‌పై ఆశలు పెట్టుకున్న పెన్షనర్లు విశాఖ ఆర్‌పీఎఫ్‌సీలను కలిశారు. పీఎఫ్ కార్యాలయంలో ఇద్దరు కమిషనర్లతో సమావేశమవ్వగా వారు తమ నిబంధనల మేరకు ఉక్కు ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ ఇవ్వలేమని తేల్చి చెప్పారు. స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ఎగ్జెంటెడ్ ట్రస్ట్ నిబంధనలు హయ్యర్ పెన్షన్‌కు అనుకూలం కాదని తెలిపారు. దీంతో పెన్షనర్లు తీవ్ర నిరాశతో నీరుగారిపోయారు. గత 16 నెలలుగా హయ్యర్ పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న పెన్షనర్ల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతుంది.

పీఎఫ్ అధికారుల చెలగాటం

పెన్షనర్లు అంటే అందరికీ అలుసే. ముఖ్యంగా పెన్షనర్లు పట్ల పీఎఫ్ అధికారులు ప్రవర్తించే తీరు చాలా విచిత్రంగా ఉంటుంది. సర్వీసులో ఉండగా ఆయా సంస్థల కోసం అహర్నిశలు కృషి చేసి 58 ఏళ్ల తర్వాత రిటైర్ అయ్యే పరిస్థితిలో వచ్చే పెన్షన్ కోసం ఉద్యోగులు ఆశగా ఎదురు చేస్తుంటారు. కానీ పీఎఫ్ అధికారులు వారు కూడా ఉద్యోగులమనే విషయం మర్చిపోయి సమస్యలపై వచ్చే వారిని తిప్పుకోవడం అలవాటుగా మారిపోయింది. ఇక స్టీల్‌ప్లాంట్ హయ్యర్ పెన్షనర్ల అంశంలోకి వస్తే హయ్యర్ పెన్షన్‌కు అర్హత లేనప్పుడు 3 వేల మందికి డిమాండ్ నోటీసులు ఎందుకు జారీ చేశారు... లక్షలాది రూపాయల చొప్పున ఎలా కట్టించుకున్నారు... సుమారు రూ.400 కోట్లు ఎలా కట్టించుకున్నారు... కట్టించుకున్న తర్వాత 16 నెలలు ఎందుకు తిప్పుకున్నారు.... చివరకు అర్హత లేదని ఎలా చెబుతారనే ప్రశ్నలు తలెత్తుతున్నా సమాధానం చెప్పే వారు లేకుండాపోయారు.

నిరాకరించడం దుర్మార్గం



సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అందరికీ హయ్యర్ పెన్షన్ ఇవ్వాల్సి ఉంది. హయ్యర్ పెన్షన్ కోసం ఆర్‌పీఎఫ్ అధికారులు నోటీసులు ఇచ్చి రూ.400 కోట్లు వసూలు చేశారు. 16 నెలలు తిప్పుకుని తర్వాత హయ్యర్ పెన్షన్ నిరాకరించడం దుర్మార్గం. ఈ అంశంపై కేంద్ర కార్మిక శాఖ మంత్రిని కలవడంతోపాటు అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తాం.

– కె.వి.డి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఉక్కు అధికారుల సంఘం

అప్పులు చేసి కట్టారు



హయ్యర్ పెన్షన్ వస్తుందని పెన్షనర్లు ఎంతో ఆశగా ఎదురు చూశారు. డిమాండ్ నోటీసు మేరకు అప్పులు చేసి, ఫిక్సిడ్ డిపాజిట్లు తీసేసి ఈపీఎఫ్‌ఓకు కట్టారు. ఇప్పుడు అర్హులు కాదని అధికారులు చెప్పడం ఎంత వరకు సబబు. ఈ అంశంపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అందరికీ హయ్యర్ పెన్షన్ వచ్చేలా కృషి చేయాలి.

– మాటూరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ పెన్షనర్ల సంఘం

మోసాలపై అప్రమత్తత అవసరం



పోలీసు కమిషనర్ బాగ్చిని అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ నాయకులు

ఉక్కునగరం : రోజురోజుకూ పెరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య నేతృత్వంలో నాయకులు గురువారం పోలీసు కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల స్థలాలు పేరిట రియల్ ఎస్టేట్, ఆన్‌లైన్ పేరిట కొంత మంది చేస్తున్న మోసాలను ఆయనకు వివరించారు. ఈ విధంగా మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై సీపీ స్పందిస్తూ తమ దృష్టికి వచ్చిన బాధితులందరికీ న్యాయం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమకు జరిగిన మోసం, అన్యాయాలను పోలీసులకు చెబితేనే వారికి న్యాయం చేయగలమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దాసరి పుల్లారావు, బి.డేవిడ్, కప్పల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి : ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 పరిధిలోని కేబీఆర్ 33 కేవీ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేబీఆర్, ఆలిండియా రేడియో స్టేషన్, పారిశ్రామిక ప్రాంతం, కేబీఆర్ ఫీడర్ల పరిధిలోని శాతవాహన నగర్ రోడ్డు 1 నుంచి 9 వరకు, ముస్తఫా జంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటీఐ రోడ్డు, గౌరీనగర్, యాతపాలెం, అశోక్‌నగర్, శివాజీనగర్, ఆలిండియా రేడియో రిసీవింగ్ స్టేషన్, శివసాయి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.

ఉక్కు పరిరక్షణ పోరాటంలో ఉద్యోగుల వెంట ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటంలో తాను ఉద్యోగుల వెంటే ఉంటానని జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం సాయంత్రం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన యువ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీతో ఈ సమస్య పరిష్కారం కాదన్నారు. సొంత గనులు కేటాయించడం తప్ప మరొక మార్గం లేదన్నారు. అలాకాని పక్షంలో ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ముడి ఖనిజం ఖర్చులు బాగా తగ్గి లాభాల బాట పడుతుందన్నారు. ఈ పరిశ్రమ విలువ పెరగాలంటే భూములను పరిశ్రమ పేరిట బదలాయించాలన్నారు. అంత వరకు టాక్స్ హాలిడే ఇస్తే వడ్డీల భారం తగ్గి కర్మాగారం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. ఇందుకోసం కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాలతో ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఆ ఉద్యమంలో తాను కూడా ఉద్యోగుల వెంట ఉంటానన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ



సోలార్ విద్యుత్ ప్రయోజనాలు వివరించే గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అతిథులు

అగనంపూడి : పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవడానికి రాయితీపై అందిస్తున్న సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.ప్రసాద్ సూచించారు. జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ కూడలిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, విద్యుత్ వినియోగం పెరుగుతోందని, దీంతో అందరిపైనా భారం పడుతోందన్నారు. తక్కువ ధరకు విద్యుత్ తయారు చేసుకునే వెసులుబాటు మీ ఇంట్లోనే ఉంటుందన్నారు. ఈ పథకం గృహ వినియోగదారుల కోసమే ప్రవేశపెట్టారన్నారు. ఒక కిలోవాట్‌కు ప్రభుత్వం రూ.30 వేలు రాయితీ అందిస్తుందన్నారు. ఈ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగం పెరగడం వల్ల తరచూ విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గుల సమస్య ఉందని, దాని నుంచి బయటపడడానికి ఇదో మార్గమన్నారు. అలాగే ఈ ప్రాంతంలో లో ఓల్టేజీ సమస్య తగ్గించడానికి రెండు చోట్ల అదనపు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అనంతరం గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఈఈలు సంపంగి రామకృష్ణ, సురేఖ, డీపీఈ దాసరి శంకర వరప్రసాద్, కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, ఏఈ జె.లక్ష్మణరావు, సిద్ధ గోవిందరావు, బలిరెడ్డి సత్యనారాయణ, తనుబుద్ధి రామారావు, బీఎస్.నాయుడు, శనివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు పౌష్టికాహారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయదేవి

సీతమ్మధార : బాలికలకు తగినంత పౌష్టికాహారం అందేలా చూడాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి సూచించారు. చినగదిలి మండలం అంగన్‌వాడీ సిబ్బందికి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి కిశోరీ బాలికల సంరక్షణపై రేసపువానిపాలెంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికలు రక్తహీనతకు గురికాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తగినంత పౌష్టికాహారం అందజేస్తున్నామని గుర్తు చేశారు. కౌమార దశ పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పండగలా నిర్వహించాలని సూచించారు. సీడీపీవో ఎం.వి.రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ వివిధ చట్టాలపై వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు నడుము బిగిద్దాం పేరిట ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



సినిమా పాటలు పాడుతున్న గాయకులు

సీతంపేట : ఘంటసాల సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు నరసింహమూర్తి, పెమ్మరాజు, సాంబశివరావు, కె.ఎల్.రావు, నాగేశ్వరరావు, రామ నరసింహం, ఆంజనేయరెడ్డి, జిలాని, సి.వి.రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, ఎస్.రాజేశ్వరి, పి.సత్యవతి, గంటి ఉష సోలో, యుగళ గీతాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో సన్ మూర్తి, కట్టా మల్లేశ్వరరావు, ఎస్.రాజేశ్వరి, పి.బి.ఖాన్ పాల్గొన్నారు.

కోచ్ ఇండికేటర్లు మొరాయించడంతో ఇబ్బందులు



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పనిచేయని కోచ్ ఇండికేటర్

అగనంపూడి : విజయవాడ నుంచి విశాఖ మీదుగా ఒడిశా, బెంగాల్ వెళ్లే రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కోచ్ ఇండికేటర్లు పనిచేయక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు ప్లాట్‌ఫామ్ – 4 వైపున డిజిటల్ కోచ్ ఇండికేటర్లు పనిచేయడం లేదు. దీంతో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు లగేజీలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులతో పరుగులు తీస్తూ రైలు ఎక్కాల్సిన పరిస్థితి వస్తోంది. దీనిపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి ఇండికేటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి : కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డులో రూ.రెండు కోట్లతో పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులకు మొదటి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అపరిష్కృతంగా మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, నాయకులు రాజన్‌రాజు, కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ, దివ్య అప్పారావు, ప్రగడ దానయ్య, పావడ రమణమూర్తి, ఆనంద్‌కుమార్, సూరిశెట్టి పెంటారావు, కర్రి నరసింగరావు, మాటూరి రాము, కణితి ఈశ్వరరావు, గెద్దాడ రాంబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ



తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు

సీతంపేట : లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు తిరంగ ర్యాలీ గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. 75వ రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా 75 అడుగుల మువ్వన్నెల జెండాతో కళాశాల అధ్యాపక సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ క్యాడెట్లు పాల్గొని సుమారు 4.2 కిలో మీటర్లు ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ వీఐపీ రోడ్, ఆశీలుమెట్ట జంక్షన్, జీవీఎంసీ గాంధీ విగ్రహం, రామాటాకీస్ మీదుగా కళాశాలకు చేరుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె. చక్రవర్తి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

నేతాజీ సేవలు మరువలేం



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న త్రినాథ్, తదితరులు

పెదగంట్యాడ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేమని త్రినాథ్ స్కిల్ డెవలప్‌మెంట్ టెస్టింగ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత వంజరాన త్రినాథ్ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను 76వ వార్డు పరిధి నడుపూరు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బోస్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జోగారావు, పూర్ణచంద్ర, జగదీష్, వెంకటేష్, మోహన్‌రావు పాల్గొన్నారు.



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

అగనంపూడి : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనివని మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు అన్నారు. బోస్ జయంతి సందర్భంగా పాత అగనంపూడి సత్రం కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బళ్ల పైడిరాజు, మామిడి మేన, శేఖర్, అప్పారావు, శ్రీను పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులపై ఇన్సూరెన్స్ భారం మోపొద్దు



ధర్నాలో ప్రసంగిస్తున్న కృష్ణారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులపై వైద్య భారం ఉపసంహరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ అత్యంత ప్రమాదకర పరిశ్రమలో మూడు దశాబ్దాలుగా తమ సేవలతో ఉద్యోగులు ప్లాంట్ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఉద్యోగులకు చెరో రూ.1300తో భార్యా, భర్తలకు రూ.3 లక్షల వరకు వైద్యం చేసుకునేలా ఇన్సూరెన్స్ ఉండేదన్నారు. ఆ స్కీమ్ ద్వారా ఏడాదికి రూ.8 వేలు అవుట్ పేషంట్‌గా బిల్లు పొందే అవకాశం ఉండేదన్నారు. ఆ స్కీమ్ ద్వారా యాజమాన్యం కేవలం రూ.30 కోట్లు బడ్జెట్ వ్యయం చేసేదన్నారు. ప్రస్తుతం యాజమాన్యం ఆ స్కీమ్‌ను మార్చి వేసి భార్యభర్తలకు చెరో రూ.10 వేల చొప్పున ఏడాదికి రూ.20 వేలు చెల్లించేలా మార్పు చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆ ప్రతిపాదన ఉపసంహరించాలని కోరారు. అదే విధంగా ఉద్యోగులకు బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి సీఎండీ సక్సేనాకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామి, మాజీ అధ్యక్షుడు ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాజీనామాలు చేయాల్సింది ఉద్యోగులు కాదని.. కూటమి నాయకులని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్యదర్శి బి.జగన్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1400 రోజుల నుంచి కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ పోరాట ఫలితంగానే స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఒక్క శాతం కూడా ప్రైవేట్‌పరం చేయలేకపోయిందన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఏ రోజు తమకు ప్యాకేజీ కావాలని కోరలేదన్నారు. బీజేపీ నాయకులు పనిగట్టుకుని స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అవహేళన చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ మాట్లాడుతూ ఈ ప్యాకేజీ సరిపోకపోతే ఉద్యోగులు రాజీనామాలు చేసి వెళ్లిపోవాలనడం దుర్మార్గం అన్నారు. ప్రజా పోరాటాలను అవహేళన చేసిన వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. కార్మికులను, పోరాటాలను అవహేళన చేసే ప్రకటనలు మానుకోవాలని డిమాండ్ చేశారు.